AP 4PG 21 - 1- 2026 WEDNESDAY qxp_Layout 1 21-01-2026 07:19 AM Page 2



## భక్తిశ్రద్ధలతో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం



యాడికి, జనవరి 20 (అనంత ప్రభ)
శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని యాడికిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నందు మంగళవారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మాఘ శుద్ధ విదియ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉదయం గణపతి పూజ, నవగ్రహ పూజలతో కార్యక్రమాలు ప్రారంభమై, అనంతరం శివ పార్వతులకు మరియు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం,కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి గుండ ప్రవేశం, పూర్ణాహుతి, మహా మంగళహారతి కార్యక్రమాలు వైదికమంత్రోచ్చారణల మధ్య అద్భుతంగా సాగాయి. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఉదయం నుంచి అల్పాహారం, మధ్యాహ్నం అన్న ప్రసాదం ఏర్పాటు చేయగా, వందలాది మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం జై వాసవి మాత జై జై వాసవి మాత అనే నినాదాలతో మార్మోగి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమాలను యాడికి ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు

## మత్తు పదార్థాలపై అవగాహన



యాడికి, జనవరి 20 (అనంత ప్రభ)
ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం యాడికిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు విస్తృతంగా వివరించారు. హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, ఆరోగ్య సమస్యలతో పాటు చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ఇటువంటి అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ శివ మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని, చదువుతో పాటు మంచి విలువలను పాటించినప్పుడే జీవితంలో ఉన్నత సాధ్యికి చేరుకోవచ్చని అన్నారు. పోలీస్ శాఖ విద్యార్థుల భద్రత, భవిష్యత్తు కోసం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## కుటుంబ కలహం చిన్నారి ప్రాణం తీసింది



యాడికి, జనవరి 20 (అనంత ప్రభ)
యాడికి మండలం చందన లక్ష్మంపల్లె గ్రామంలో చోటుచేసుకున్న విషాద ఘటనలో నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన కేసులో ముద్దాయి తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. లక్ష్మంపల్లె గ్రామానికి చెందిన మండల రమేష్ మరియు అతని భార్య మండల మహేశ్వరి మధ్య కుటుంబ విషయాలపై ఈనెల 16వ తేదీ సాయంత్రం గొడవ జరిగింది. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన రమేష్ ఇంటి వాకిలి వద్ద అడ్డంగా ఉంచిన చిన్న గుండ్రాయిని భార్యపైకి విసిరాడు. ఆ రాయి ఆమె చంకలో ఉన్న వారి నాలుగేళ్ల కుమారుడు రాహుల్ తలకు తగిలి తీవ్ర రక్తగాయమైంది. తక్షణమే బాలుడిని చికిత్స నిమిత్తం తాడిపత్రిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని అమీలియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 18వ తేదీ తెల్లవారుజామున బాలుడు మృతి చెందాడు. ఈ ఘటనపై బాలుడి తల్లి మండల మహేశ్వరి ఫిర్యాదు మేరకు యాడికి పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం మంగళవారం సాయంత్రం నిందితుడు రమేష్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు

## స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఎం రమేష్ ను కొనియాడిన అధికారులు




యాడికి, జనవరి 20 (అనంత ప్రభ)
జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో ఎం.పి.హెచ్.ఈ.ఓగా సేవలందించిన ఎం. రమేష్ స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డి. ఓబుల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎం రమేష్ సేవలను అధికారులు, సిబ్బంది కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన సబ్ యూనిట్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని, మలేరియా నియంత్రణలో రమేష్ అందించిన విశేష సేవలను ప్రశంసించారు. ప్రజారోగ్య రంగంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన రమేష్ కి అష్ట ఐశ్వర్యాలు,ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు శ్రీనివాసులు, రామకృష్ణ పాల్గొని తమ అభినందనలు తెలియజేశారు

## కమర్షియల్ కాంప్లెక్స్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని వినతి



యాడికి ,జనవరి 20 (అనంత ప్రభ )
యాడికి మండల కేంద్రంలోని కమర్షియల్ కాంప్లెక్స్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆర్ ఐ కృష్ణయ్యకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాతకుంట్ల బాలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 23న మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదురుగా ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్ భవనం ప్రారంభోత్సవం నిర్వహించినప్పటికీ ఇప్పటివరకు ఆ భవనం వినియోగంలోకి రాలేదని తెలిపారు. మండలానికి చెందిన ఒక ఎస్సీ మహిళ ఎస్సీ కోటాలో వ్యాపారం నిర్వహించుకునేందుకు కొరకు ఒక గది కేటాయించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో భవనం ప్రారంభం ఆలస్యమవుతోందని వివరించారు. ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు, సంబంధిత మహిళతో చర్చించి ఎస్సీలకు వేరుగా వేలం పాట నిర్వహించి భవనాన్ని ప్రారంభించాలని ఆయన సూచించారు. భవనం వాడుకలో లేకపోవడం వల్ల గ్రామపంచాయతీ ఆదాయానికి తీవ్ర నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఆ భవనం ద్వారా వచ్చే ఆదాయంతో యాడికి మేజర్ పంచాయతీలో అనేక అభివృద్ధి పనులు చేపట్టవచ్చని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిగణలోకి తీసుకొని పరిష్కరించేలా జిల్లా కలెక్టర్ గారికి, ప్రభుత్వానికి తహశీల్దారు గారు విజ్ఞప్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి చిరంజీవి, తదితర నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## మామిడి తోటల్లో పూత దశలో చీడపీడల నివారణకు తగు జాగ్రత్తలు అవసరం



పుట్టపర్తి, జనవరి 20 (అనంత ప్రభ)
ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లాలోని మామిడి తోటలు పూత దశలో ఉన్నందున.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో బూడిద తెగులు, తేనె మంచు పురుగు మరియు ఇతర చీడపీడలు సోకకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని, ఈ మేరకు క్షేత్రస్థాయిలో తగు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు.
బూడిద తెగులు సోకిన తోటల్లో పువ్వు కాడలపై బూడిద ఏర్పడి పిందెలు పడకపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణకు హెక్సాకోనజోల్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే తేనె మంచు పురుగు మరియు ఇతర రసం పీల్చే పురుగులు గమనించినట్లయితే ఇమిడాక్లోప్రైడ్ 0.5 మి.లీ. లేదా థయామెథాక్సామ్ 0.3 గ్రాములు లేదా ఎథిప్రోల్ 1.5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అలాగే పూత 75 శాతం వరకు వికసించిన దశలో ఎలాంటి చీడపీడలు గమనించని పరిస్థితుల్లో మందులు పిచికారి చేయకూడదని స్పష్టం చేశారు. పిందెలు జొన్న గింజ, బఠాణీ లేదా గోలికాయ పరిమాణంలో ఉన్నప్పుడు రాలిపోతున్నట్లయితే ప్లానోఫిక్స్ 3 మి.లీ.ని 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే పాదుల్లో తేమను గమనించి అవసరమైతే ఒక అరతడి ఇవ్వాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉద్యాన శాఖ సూచనలను పాటిస్తూ రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పంటను కాపాడుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్ ఆ ప్రకటనలో కోరారు

## ఉరవకొండ సమన్వయకర్త, యువనేత ప్రణయ్ రెడ్డి కి రాష్ట్ర మాజీ సీఎం వైయస్ జగన్ పిలుపు



కూడేరు, జనవరి 20 (అనంత ప్రభ)
రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఉరవకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వైసీపీ సమన్వయకర్త వై. విశ్వేశ్వర రెడ్డి, మరియు రాష్ట్ర యువనేత వై.ప్రణయ్ రెడ్డి మంగళవారం రోజున విజయవాడలోని తాడేపల్లి లోని కేంద్ర పార్టీ కార్యాలయం లో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉరవకొండ నియోజకవర్గంలోని తెదేపాకు దీటుగా ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ రాజకీయ ఒడిదుడుకుల మధ్య నియోజకవర్గంలోని వైసిపి పార్టీ కి అండగా ఉంటుందందుకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అభినందించారు. ఉరవకొండ నియోజకవర్గం లోని వైసీపీ యువజన విభాగంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై మరియు నియోజకవర్గంలోని పార్టీ ని ఎప్పటికప్పుడు బలోపేతం చేస్తూ వైఎసచవతీతీచర్ కాంగ్రెస్ పార్టీని చురుగ్గా ముందుకు తీసుకు వెళ్తున్నందుకు యువనేత ప్రణయ్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. అయితే 2029లో నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగరవేయడానికి ఉరవకొండ వైసీపీ సమన్వయకర్తగా, మరియు వైసిపి యువనేతగా పార్టీ గెలుపే లక్ష్యంగా సిద్ధం కావాలని చర్చించినట్లు తెలుస్తోంది

## శ్రీ వాసవి మాత కన్యకా పరమేశ్వరాలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించిన తెదేపా మండల కన్వీనర్





ఆత్మకూరు, జనవరి 20 (అనంత ప్రభ)
ఆత్మకూరు మండల కేంద్రంలోని మంగళవారం రోజున ఆత్మకూరు తెదేపా మండల కన్వీనర్ బోయ గంతి శ్రీనివాసులు శ్రీ వాసవి మాత కన్యకాపరమేశ్వరి ఆలయం నందు శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా హోమాలు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీనరసింహ, ఎస్సై గౌతమ్, టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ వెంకటనారాయణ, నరసింహులు, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, అధ్యక్షులు కొండయ్య, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కార్తీక్, మధుసూదన్, సురేష్, పురోహితులు ఫణి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ



అనంతపురం, జనవరి 20 (అనంత ప్రభ)
జిల్లాలో పనిచేయడం చాలా సంతృప్తినిచ్చిందని, అధికారులు, ఉద్యోగుల అభిమానం మరువలేనిదని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అన్నారు. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళుతున్న ఆయనకు జిల్లా యంత్రాంగం మంగళవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన సేవలను జిల్లా అధికారులు కొనియాడారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌ను అధికారులు సన్మానించి మొమెంటో అందజేశారు. కార్యక్రమంలో అస్టింట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్ఓ మలోల, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు

## కందులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన చేసిన డి.ఏ.ఓ. రవి



కూడేరు, జనవరి 20 (అనంత ప్రభ)
కుడేరు మండల కేంద్రంలోని మంగళవారం రోజున జిల్లా వ్యవసాయ అధికారి రవి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన కందుల నాణ్యతను పరిశీలించి, తేమ శాతం, శుభ్రత, గ్రేడింగ్ విధానాలను పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వ మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరళమైన విధానంలో కొనుగోలు ప్రక్రియ నిర్వహించడంతో పాటు, నగదు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, తూకం యంత్రాల ఖచ్చితత్వం తదితర అంశాలను కూడా పరిశీలించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరళమైన విధానంలో కొనుగోలు ప్రక్రియ నిర్వహించడంతో పాటు, నగదు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, చింతల నాయుడు , మరియు రైతులు పాల్గొన్నారు

## ఏ.పీ యన్. జి. జి. ఓ. ఎన్నికలల్లో అనంతపురం జిల్లా జాయింట్ సెక్రెటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన హృషికేష్




అనంతపురం, జనవరి 20 (అనంత ప్రభ)
అనంతపురం ఈరోజు ఇటీవల జరిగిన ఎన్నికలలో. విజయం సాధించిన ఏ.పీ యన్. జి. జి. ఓ. ఎన్నికలల్లో అనంతపురం జిల్లా జాయింట్ సెక్రెటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతపురం స్టాంప్స్ మరియు రి జిస్ట్రేషన్స్ శాఖకార్యాలయం నందు డి. ఐ. జి. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఆయినటువంటి కే. హృషికేష్ ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది. ఇందులో కంబదూరుజడ్పీటీసీ గుద్దేళ్ల నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై నిబద్ధతతో పనిచేస్తూ ఉద్యోగుల సంక్షేమం కోసం అంకితభావాన్ని చాటుకున్న జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎన్నిక కావడం ఉద్యోగ వర్గాలకు గర్వకారణమని తెలిపారు ఉద్యోగుల హక్కులకు పరిరక్షణతో పాటు సంక్షేమ కార్యక్రమాలు ఆయన పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు కార్యాలయా విధుల్లోనూ నిబద్దత నిడంబరమైన సేవాధిపదంతో క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు కార్యక్రమంలో వైస్సార్సీపీ సత్యసాయి జిల్లా కార్యదర్శి బండారు అనిల్ స్వేరోస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి. తిరమలయ్య , రాప్తాడు నియోజకవర్గ వైస్సార్సీపీ ఎస్. సి సెల్ మాజీ అధ్యక్షులు జై ముత్యాలు గార్లు పాల్గొన్నారు

## వేమన పద్య పోటీలలో రాణించిన పోలీస్ రక్షక్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు జిల్లా ఎస్పీ అభినందనలు



అనంతపురం, జనవరి 20 (అనంత ప్రభ)
వేమన పద్య పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన పోలీస్ రక్షక్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్, ఐ.పీ.ఎస్. గారు బహుమతులు అందజేసి, హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అనంతపురం వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేమన పద్య పోటీలు రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రతిష్టాత్మకంగా ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా ఈరోజు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని పోలీస్ రక్షక్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు వేమన పద్య పోటీలు జరిపారు. వేమన పద్య పోటీలలో రాణించిన విద్యార్థులను గుర్తించి విజేతలకు జిల్లా ఎస్పీ గారు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వేమన తత్వబోధలు నేటి తరం విద్యార్థులకు ఆదర్శప్రాయంగా, మార్గదర్శకంగా నిలుస్తాయని ఎస్పీ గారు అభిప్రాయపడ్డారు. రక్షక్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను జిల్లా ఎస్పీ గారు అభినందించారు.

## అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, జనవరి 20 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలోని అగాపే వృద్ధాశ్రమంలో కీ.శే. జాఫర్ సాహెబ్ (హెడ్ కానిస్టేబుల్) 24వ వర్ధంతి సందర్భంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ సాహెబ్ జ్ఞాపకార్థంగా ఆయన భార్య ఖాజాబి, కుమారులు చాంద్ భాష సత్తార్, కోడళ్ళు, కుమార్తెలు షహనాజ్, షహజాది, మనవాళ్లు, మనవరాలు కలిసి ఆశ్రమంలో నివసిస్తున్న నిరాశ్రయ వృద్ధులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ అగాపే ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేసే ఇలాంటి కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినివ్వాలని తెలిపారు.

